

వైభవంగా సాయినాథ వార్షికోత్సవం


ఫిరంగిపురం: ఫిరంగిపురం సొలస బస్టాండు సమీపంలోని సాయినాథ ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు.



అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

మాచర్ల: మాచర్ల శ్రీశైలం రోడ్డులోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

ఆలయ ప్రతిష్ట వార్షికోత్సవం



దాచేపల్లి: స్థానిక వాసవీ కన్యకపర మేశ్వరి అమ్మవారి దేవాలయం 9వ వార్షికోత్సవ పూజలు శనివారం వైభవంగా జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
బాపట్ల	6.23	4.58
నరసరావుపేట	6.25	5.00
గుంటూరు	6.23	4.58

కుట్ర రాజకీయాలపై ఉగ్రరూపం

అధికారం అండ చూసుకుని కాల'కూటమి' విషం చిమ్ముతూనే ఉంది. గుంటూరు నగరపాలక సంస్థపై పెత్తనం చలాయించడానికి మాయోపాయాలు పన్నుతూనే ఉంది. నిస్సిగ్గుగా సంతలో పశువులను కొన్నట్లు కార్పొరేటర్లను కొన్న కూటమి నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. కమిషనర్‌ను అడ్డం పెట్టుకుని నాటకాలు ఆడుతున్నారు. అడుగడుగునా మేయర్ కావటిని అవమానపరున్నారు. నగరపాలక సంస్థపై కూటమి పెత్తనంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆయన పదవికి రాజీనామా చేశారు. ఇటు జిల్లా పరిషత్‌లోనూ చైర్‌పర్సన్ అరాచకాలకు అడ్డూఅదుపూ లేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులతో, అత్యవసర పనుల పేరుతో కోట్లాది రూపాయల విలువైన పనులకు ముందస్తు అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు బడ్జెట్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు.

- వేడెక్కిన గుంటూరు జిల్లా రాజకీయం
- ఒకే రోజు రెండు పరిణామాలు
- మేయర్ పదవికి కావటి మనోహర్ రాజీనామా
- జెడ్పీ సమావేశాన్ని బహిష్కరించిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు
- కోరం లేక వాయిదా
- రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నిరసిస్తూ నిర్ణయాలు



జెడ్పీ సమావేశానికి హాజరైన సభ్యులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులను సంతలో పశువుల్లా కొనుగోలు చేస్తూ, ప్రజలతో ఎన్నుకోబడిన స్థానిక సంస్థలను అపహాస్యం చేస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని నిరసిస్తూ గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పదవికి శనివారం రాజీనామా చేశారు. మరోవైపు అధికారాన్ని అడ్డం పెట్టుకుని బడ్జెట్ ఆమోదించకుండానే రూ. 12 కోట్ల విలువైన పనులను ముందుగానే ఆమోదించుకోవడానికి జెడ్పీ చైర్‌పర్సన్ పేరుతో కూటమి ప్రజా ప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాన్ని వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు అడ్డుకున్నారు. సమావేశానికి వారు రాకపోవడంతో కోరం లేక వాయిదా వేయాల్సి వచ్చింది.

సంతలో పశువుల్లా కార్పొరేటర్ల కొనుగోలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సరికి గుంటూరు నగరపాలక సంస్థలో వైఎస్సార్ సీపీ పాలక వర్గం పూర్తి మెజార్టీతో అధికారంలో ఉంది. ఎలాగైనా దొడ్డిదారిలో స్థాయి సంఘాన్ని దక్కించుకునేందుకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ముగ్గురు ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు కుట్ర పన్నారు. కార్పొరేటర్లను ప్రలోభాలకు గురి చేసి సంతలో పశువులను కొన్నట్లు కొనుగోళ్లకు తెర లేపారు. వారే స్వయంగా కార్పొరేటర్ల ఇంటికి వెళ్లి మరీ కండువాలు కప్పి వచ్చారు.

వంత పాడుతున్న కమిషనర్

నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కూడా రాజకీయ నాయకుడిలా టీడీపీ నేతల వంత పాడారు. చిన్న అంశాన్ని అడ్డం పెట్టుకుని కౌన్సిల్‌ను బాయ్‌కాట్ చేసిన ఆయన తర్వాత మేయర్ ఎన్నిసార్లు లేఖలు రాసినా కౌన్సిల్ సమావేశం పెట్టకుండా అడ్డం పడ్డారు. దొడ్డిదారిన స్థాయి సంఘాన్ని అందిపుచ్చుకున్న తర్వాత ఎమ్మెల్సీ కోడ్ ముగియడంతో తాజాగా మేయర్ ప్రమేయం లేకుండానే స్థాయీ సంఘం సమావేశం తేదీని నిర్ణయించి ప్రకటించేశారు. అజెండా విషయంలో కూడా మేయర్‌ను సంప్రదించలేదు.

మేయర్‌కు అవమానాలు



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి ఆటలపోటీల విషయంలో గానీ, తర్వాత జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి మేయర్‌కు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా అవమానిస్తూ వచ్చారు. పైగా మేయర్ వద్ద ఉన్న సిబ్బందిని కుదించి వేశారు. కారును, డ్రైవర్‌ను, అటెండర్‌ను, ఆఫీస్ స్టాఫ్‌ను, అఖరి బిళ్ల బంట్రోతును కూడా తీసేశారు. చాంబర్‌కు వస్తే తాళాలు వేసి పావుగంట సేపు బయట నిలబడేలా చేశారు. మరోవైపు మేయర్‌ను దింపివేసి తమ అభ్యర్థిని బరిలోకి నిలబెడుతున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్పొరేటర్ కోవెలమూడి రవీంద్ర పేరును ప్రకటించారు. మేయర్ పదవిని దక్కించుకునేందుకు మిగిలిన కార్పొరేటర్లతో మంతనాలు మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో ఈ అవమానాలను నిరసిస్తూ మేయర్ కావటి మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పెత్తనం



మరోవైపు శనివారం జరగాల్సిన జెడ్పీ సభ్య సమావేశాన్ని వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు బాయ్‌కాట్ చేయడంతో కోరం లేక వాయిదా పడింది. జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో 82 మంది సభ్యులు ఉండగా 27 మంది హాజరైతేనే కోరం వస్తుంది. 13 మందే హాజరు కావడంతో వాయిదా వేయాల్సి వచ్చింది. ప్రజల ఓట్లతో గెలిచిన తమకు కనీస గౌరవం లేకుండా పోయిందని జెడ్పీటీసీ సభ్యులు ఆరోపిస్తున్నారు. బడ్జెట్ ఆమోదం పొందకుండానే ముందస్తు అనుమతుల పేరుతో జెడ్పీ చైర్‌పర్సన్ నేరుగా సంతకాలు చేసి పనులు మంజూరు చేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులతో, అత్యసర పనుల పేరుతో కోట్లాది రూపాయల విలువైన పనులకు ముందస్తు అనుమతులు ఇస్తున్నారు. కమీషన్లు, పర్సంటేజీలకు కక్కుర్తి పడి రూ.12 కోట్ల విలువైన పనులకు అనుమతులు ఇచ్చేశారు. ప్రజాధనాన్ని పరిరక్షించడం కోసం 42 మంది జెడ్పీటీసీ సభ్యులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేయడంతో బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జిల్లా ప్రత్యేక అధికారి కృతికా శుక్లా



బాపట్ల: ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి కృతికా శుక్లా అన్నారు. బాపట్ల సూర్యలంక బీచ్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించిందన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఇస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వివరించారు. ఇందుకోసం అధికారులకు దిశానిర్దేశం చేశారన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు జయప్రదానికి ప్రజల భాగస్వామ్యం కావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి తడి, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను వేరు చేసే విషయంపై మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. సేకరించిన తడి, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. చెత్త సేకరించే సమయంలోనే వేర్వేరుగా చేసి తిరిగి వాటిని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో 17 లక్షల మంది ప్రజలు ఉన్నారని, వీరి కోసం ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని అన్నారు. సూర్యలంక బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు భాగస్వాములయ్యారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో ఉప లోకాయుక్త



అమరావతి: ప్రముఖశైవక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుణ్ణి ఉప లోకాయుక్త జస్టిస్ రజని దంపతులు శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు జస్టిస్ రజని దంపతులకు స్వాగతం పలికారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జస్టిస్ రజని దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నృసింహుని సేవలో..

మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ రజని దంపతులు దర్శించుకున్నారు. ఎగువ దిగువ సన్నిధులలో స్వామిని దర్శించుకున్న దంపతులకు ఆలయ ఈవో, సహాయ కమిషనర్ ఏ. రామకోటిరెడ్డి, తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర ఘనంగా స్వాగతం పలికారు. రజిని దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



కారంచేడు: మన గ్రామాలను ప్లాస్టిక్, కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి మన వంతు కృషి చేయాల్సిన అవసరం మనందరిపై ఉందని బాపట్ల జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ డీ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మండలంలోని కారంచేడు, స్వర్ణ గ్రామాల్లో జరుగుతున్న 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొని ఆమె వివిధ శాఖల సిబ్బంది, గ్రామస్తులతో మాట్లాడారు. కారంచేడు గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలను ఆమె పరిశీలించారు. కార్యాలయాలను శుభ్రపరిచే కార్యక్రమంలోను పాల్గొన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం, అమ్మకాలను నిషేధించాలని ఆమె దుకాణ యజమానులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి గుడ్డ సంచులను వెంట తెచ్చుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. చినవంతెన సెంటర్‌లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులతో మానవహారం నిర్వహించి, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వర్ణ గ్రామంలో ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు జీ నాగరాజు, ఎంపీడీఓ కే నేతాజీ, హౌసింగ్ ఏఈ ఖాసీం సాహెబ్, వైద్య శాఖ, పంచాయతీ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నగరంపాలెం:గుంటూరు ఆర్.అగ్రహారంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ప్రాతఃకాల ఆరాధన, స్వామికి తిరుమంజన స్నపన, అలంకార పూజ, నిత్యార్చన, నిత్య హోమం, బలిహరణ కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు భక్తిప్రపత్తులతో చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో తిలకించారు. ఆలయ కమిటీ అన్న ప్రసాద వితరణ చేసింది. సాయంత్రం నిత్య హోమం నిర్వహించారు. స్వామివారి రథోత్సవం భక్తుల గోవింద నామస్మరణతో ఆర్.అగ్రహారం ప్రధాన వీధుల్లో కొనసాగింది. మంగళ వాయిద్యాలు, డప్పులు, దేవతామూర్తుల వేషధారణలతో రథోత్సవం ఆకట్టుకుంది. ఆలయ వ్యవస్థాపకులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీలకు సముచిత గౌరవం లేదు

- జెడ్పీటీసీల ప్రమేయం లేకుండా నిధులు మంజూరు చేయడం తగదు
- కమీషన్లు, పర్సంటేజీలు దండుకుంటున్నారు
- వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా పనిచేయడం సహించలేకున్నాం
- మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు

గుంటూరుఎడ్యుకేషన్: ప్రజల ఓట్లతో గెలిచిన తమకు కనీస గౌరవం, సముచిత స్థానం కరువయ్యాయని వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జెడ్పీలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన జెడ్పీటీసీలు గుంటూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

పార్టీ అధినేతపై అనుచిత వ్యాఖ్యలు

రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత జెడ్పీ ఎన్నికల్లో కత్తెర హెనీ క్రిస్టినాకు జెడ్పీటీసీగా గెలిపించడంతోపాటు చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం టీడీపీలోకి వెళ్లిన క్రిస్టినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఎంతో ఆవేదనకు గురి చేశాయని చెప్పారు. ప్రజల ఓట్లతో గెలిచిన జెడ్పీటీసీలకు గౌరవం ఇవ్వకపోగా, ముందస్తు అనుమతుల పేరుతో జెడ్పీ చైర్‌పర్సన్ నేరుగా సంతకాలు చేసి పనులు మంజూరు చేస్తున్నారని అన్నారు. జెడ్పీటీసీల ప్రమేయం లేకుండా, సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకురాకుండా పనులు మంజూరు చేస్తున్నప్పుడు ఇక తమకు విలువ ఎక్కడిదని ప్రశ్నించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులతో, అత్యవసర పనుల పేరుతో కోట్లాది రూపాయల విలువైన పనులకు ముందస్తు అనుమతులు ఇస్తూ, వాటిలో కమీషన్లు, పర్సంటేజీలు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జరగాల్సిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉండటంతోపాటు రూ.12 కోట్ల విలువైన పనులకు ముందస్తు అనుమతులను చైర్‌పర్సన్ ఇచ్చేశారని చెప్పారు. తామందరం సమావేశానికి వెళ్లి ఉంటే తమ అంగీకారం లేకున్నా, కోరం ఉందనే సాకుతో బడ్జెట్‌ను ఆమోదించడంతోపాటు సంబంధిత రూ.12 కోట్ల పనులను తమ అంగీకారం లేకుండా ఆమోదించుకునే వారని చెప్పారు. ప్రజాధనం వృథా కారాదనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీకి చెందిన 42 మంది సభ్యులు సమావేశాన్ని బహిష్కరించినట్లు పేర్కొన్నారు. అసలు ముందస్తు అనుమతులు అనే మాట పంచాయతీరాజ్ చట్టంలోనే లేదన్నారు.

ఏకపక్షంగా కేటాయింపులు

ప్రత్తిపాడు జెడ్పీటీసీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా జెడ్పీటీసీలకు తెలియకుండా ఏకపక్షంగా నిధులు మంజూరు చేస్తూ, జెడ్పీని ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. అత్యవసర పనుల పేరుతో ధనార్జనే ధ్యేయంగా పనులు ఆమోదిస్తూ, కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు.

జెడ్పీటీసీలకు ప్రాధాన్యమెక్కడ?

కాకుమాను జెడ్పీటీసీ గుల్జాన్‌బేగం మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంలో చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా జెడ్పీటీసీలకు ప్రాధాన్యం కల్పించడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన 56 మంది సభ్యులుగా తాము పార్టీని నమ్ముకుని ఉండగా, కొంత మంది రాజకీయ ప్రయోజనాలతో పార్టీని వీడారని ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధులుగా తమ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు తాము ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సి ఉందని, జెడ్పీలో జరుగుతున్న కార్యకలాపాలు, నిధుల మంజూరుపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత చైర్‌పర్సన్‌కు ఉందన్నారు. పార్టీని వీడే ముందు జెడ్పీటీసీలుగా తమను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, కేవలం వ్యక్తిగత ప్రయోజనాలు మినహా, ప్రజాప్రయోజనాలు లేవన్నారు. సమావేశంలో జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఏపీ రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా



ఇంటర్మీడియెట్ పరీక్షలను పరిశీలిస్తున్న బోర్డు కమిషనర్ కృతికా శుక్లా

బాపట్ల: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఏపీ రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి కృతికా శుక్లా తెలిపారు. బాపట్ల పట్టణంలోని బాపట్ల జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల తీరు, పరీక్ష కేంద్రంలో వనరులను ఆమె పరిశీలించారు. ఇంటర్మీడియెట్ పరీక్షలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం పకడ్బందీగా చర్యలు తీసుకుందని చెప్పారు. బాపట్లలోని అన్ని కేంద్రాలలో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు. జిల్లాలో 36 పరీక్ష కేంద్రాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రత్యేక అధికారికి వివరించారు. 7,979 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయాల్సి ఉండగా 7,710 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మిగిలిన 269 మంది గైర్హాజరైనట్లు జిల్లా కలెక్టర్ జిల్లా ప్రత్యేక అధికారి దృష్టికి తెచ్చారు. వారి వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, కళాశాల ప్రధానాచార్యులు జి కోటేశ్వరరావు, పరీక్ష కేంద్రం సీఎస్ టి.భవాని, తదితరులు ఉన్నారు.

సబ్జెక్టు టీచర్లే ఇన్విజిలేటర్లు

- ఇన్విజిలేషన్ బాధ్యతల నుంచి ఎస్‌జీటీలను తప్పించిన ప్రభుత్వం
- 1048 మంది హైస్కూల్ ఉపాధ్యాయులకు బాధ్యతలు
- రేపటి నుంచి టెన్త్ పరీక్షలు
- హాజరుకానున్న 16,799 మంది విద్యార్థులు
- 103 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ



పరీక్షలకు సిద్ధమవుతున్న 10వ తరగతి విద్యార్థులు

బాపట్లటౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేటర్లుగా ఈ ఏడాది హైస్కూల్ మాస్టార్లే కొనసాగనున్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా గతంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను (ఎస్‌జీటీ)లను ఇన్విజిలేటర్లుగా నియమించేవారు. ఈసారి ఆ బాధ్యతల నుంచి ఎస్జీటీలను కూటమి ప్రభుత్వం తప్పించింది. హైస్కూల్‌లో పనిచేసే సబ్జెక్టు టీచర్లు, భాషోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయకులకు ఇన్విజిలేషన్ బాధ్యతలను అప్పగించింది. మొదటి మూడు లాంగ్వేజీ పరీక్షలకు సబ్జెక్టు టీచర్లు ఇన్విజిలేషన్ విధులు నిర్వర్తిస్తారు. తర్వాత జరిగే సబ్జెక్టు పరీక్షలకు భాషోపాధ్యాయులు, ఇతర సబ్జెక్టు టీచర్లు ఇన్విజిలేషన్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. సోమవారం నుంచి జిల్లాలోని 103 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పరీక్షల నిర్వహణ ఇలా..

జిల్లాలోని 25 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 16,799 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలికలు 8317 మంది, బాలురు 8482 మంది ఉన్నారు. పరీక్షల పర్యవేక్షణకు 103 మంది చొప్పున డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించారు. ఆరు ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాలు, 29 మంది కేటగిరి కస్టోడియన్లు, 10 మంది రూట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను నియమించారు. వీరితోపాటు 1048 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. 103 మంది క్లర్క్‌లు, 206 మంది ఏఎన్ఎంలు, 206 మంది పోలీసులతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేస్తున్నారు.

సీ కేటగిరి సెంటర్లపై ప్రత్యేక నిఘా

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరుగుతున్న 103 కేంద్రాలను ఏబీసీ కేటగిరీలుగా విభజించారు. ఇందులో ఏ-కేటగిరీ 33, బి-కేటగిరీ 41, సీ-కేటగిరీ 29 కేంద్రాలు ఉన్నాయి. సీ-కేటగిరీ కేంద్రాలపై ప్రత్యేక నిఘా కనపరుస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలను సిద్ధం చేశారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం



పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని మౌలిక వసతులు కల్పించాం. ఈ ఏడాది హైస్కూల్‌లో పని చేస్తున్న 1048 మంది భాషోపాధ్యాయులు, సబ్జెక్ట్ టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాలను ఇన్విజిలేటర్లుగా నియమించాం. హైస్కూల్ సిబ్బంది కొరత ఉన్న ప్రాంతంలో ఎస్‌జీటీలను కూడా తీసుకున్నాం. విద్యార్థులు బాగా వచ్చిన ప్రశ్నలను మాత్రమే ముందుగా రాసుకోవాలి. కష్టమైన ప్రశ్నను రాయడానికి సిద్ధపడి సమయాన్ని వృథా చేసుకోవద్దు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడి, భయానికి లోనుకావద్దు.

– శ్రీరామ్ పురుషోత్తమ్, డీఈఓ

బాలినేని..స్థాయి తెలుసుకొని మాట్లాడు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి



మార్టూరు: ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకుడు బాలినేని శ్రీనివాస రెడ్డి పిఠాపురంలో శుక్రవారం జరిగిన ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించటం 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్నట్లుందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బాలినేని తీరుపై నిప్పులు చెరిగారు. బాలినేనికి రాజకీయ భిక్ష పెట్టిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డిలను విమర్శించే అర్హత బాలినేనికి లేదని బాలినేని తీరు తల్లి పాలు తాగి ఆ తల్లి ఎదపై తన్నినట్లు ఉందని అన్నారు. తన చెల్లెలు భర్త అన్న ఒకే ఒక్క కారణం చేత నీ బావ వైవీ సుబ్బారెడ్డి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి ఒంగోలు టికెట్ ఇప్పించటంతో నీ రాజకీయ ప్రస్థానం ప్రారంభం కావడం నిజం కాదా? అదే సుబ్బారెడ్డిని అడుగడుగునా అడ్డుకుంటూ జిల్లా రాజకీయాలలో జోక్యం చేసుకోనివ్వకుండా చేసిన నీవు నీతులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని బత్తుల అన్నారు. ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ సీపీ నాశనానికి, మార్కాపురం జిల్లా కాకుండా అడ్డుకున్నది నీవు కాదా? అని ఆయన ప్రశ్నించారు? జిల్లాలోని 12 నియోజకవర్గాలలో ఒక్కో నియోజకవర్గంలో ఐదారుగురికి పార్టీ టికెట్ ఇప్పిస్తానని నమ్మబలికి ప్రతి ఎన్నికను వ్యాపారంగా మార్చుకున్న నీవా వైఎస్ జగన్‌ను విమర్శించేది? అని అన్నారు. నీ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే నీ అవినీతి అరాచకాలపై విచారణ చేయించాలని బహిరంగంగా డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

చూసిన కనులదే భాగ్యం..!




తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని టీటీడీ ఆలయంలో శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీవేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. స్వామిని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు.

– తాడికొండ

క్లుప్తంగా

సావిత్రీబాయి పూలే పుస్తకావిష్కరణ



సుజాతను సత్కరిస్తున్న కత్తి పద్మారావు

పొన్నూరు: పట్టణంలోని లుంబినీ వనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటరులో కవి డాక్టర్ కత్తి పద్మారావు రచించిన 'సావిత్రీబాయి పూలే' పుస్తకాన్ని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్ గుంటూరు జిల్లా కన్వీనర్ పిల్లి సుజాత ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జీవిత కథను పుస్తక రూపంలో ప్రపంచానికి తెలియ చేసిన డాక్టర్ కత్తి పద్మారావును అభినందించారు. భారతదేశంలో ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థలు వెలిగించిన ఒక మహోజ్వల కాంతి దీపం సావిత్రీబాయి పూలే అని పేర్కొన్నారు. ఆ మహనీయురాలి పుస్తకాన్ని ప్రతి మహిళ చెంతకు చేరుస్తానని తెలిపారు. అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్ గుంటూరు జిల్లా కన్వీనర్‌గా సమర్థంగా బాధ్యతలు నిర్వహిస్తున్న సుజాతను పద్మారావు సత్కరించారు.

రేపు న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి శనివారం తెలిపారు. టోర్నమెంట్ సోమవారం 8:30గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. స్పోర్ట్స్ అండ్ కల్చర్ కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్, ఈసీ మెంబర్స్ ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు.

విత్తన గుళికల విధానంతో మేలు

ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి

నరసరావుపేట రూరల్: వర్షాభావ పరిస్థితుల్లో రైతులు భూమిని కప్పి ఉంచే విత్తన గుళికల తయారీ విధానాన్ని అవలంభించాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో సిబ్బందికి నిర్వహిస్తున్న మూడవ రోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హాజరయ్యారు. డీపీఎం మాట్లాడుతూ వేసవిలో ప్రతి రైతు తనకున్న పొలంలో ఈ విత్తన గుళికల విధానం ఆచరించాలని తెలిపారు.

ప్రసన్నాంజనేయ స్వామి ఆదాయం రూ.14.25 లక్షలు

అద్దంకి రూరల్: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆదాయం గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం గణనీయం పెరిగినట్లు దేవస్థానం ఏసీ యం. తిమ్మనాయుడు శనివారం తెలిపారు. శనివారం దేవస్థానంలో భక్తులు వేసిన కానుకల హుండీని లెక్కించగా రూ.14,25,272, ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే దాతల నుంచి అన్నదానానికి రూ.12,939, తిరునాళ్ల సందర్భంగా టికెట్ల ద్వారా రూ.10,04,491 వచ్చినట్లు తెలిపారు. గత సంవత్సరం టికెట్ల ద్వారా రూ.8,26,435, హుండీ ద్వారా రూ.8,26,081 వచ్చినట్లు తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.2.66 లక్షలు

శింగరకొండ కొండపైన కొలువై ఉన్న క్షేత్రపాలకుడు లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఆదాయం రూ.2,66,604 వచ్చినట్లు ఏసీ కోటిరెడ్డి తెలిపారు. 15 రోజులకు భక్తులు వేసిన కానుకల హుండీని శనివారం లెక్కించగా రూ.1,38,334, తిరునాళ్ల సందర్భంగా పూజా టికెట్ల వలన 1,28,270 ఆదాయం వచ్చినట్లు తెలి పారు. గత సంవత్సరం హుండీ వలన రూ.89,974, పూజా టికెట్లు వలన రూ.1,05,350 సమకూరింది. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం అదనంగా రూ.71,280 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వెంటేశ్వరరావు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో హుండీకానుకలు లెక్కిస్తున్న సిబ్బంది



ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఆర్టీసీ ఆదాయం రూ. 2.86 లక్షలు

శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా అద్దంకి ఆర్టీసీ డిపోకు రూ.2,86,920 ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిపో నుంచి 24 బస్సులు నడిపినట్లు వివరించారు. గత సంవత్సరం రూ.2,06,940 రాగా ఈ సంవత్సరం అదనంగా రూ. 80 వేలు అదనంగా వచ్చినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ బకాయిలు వెంటనే చెల్లించాలి

ఎస్టీయూ (డి) డిమాండ్

అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ(డి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జేబీ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఎస్టీయూ(డి) సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘం మండల అధ్యక్షుడు జి.ఆనందరావు అధ్యక్షత వహించారు. సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అరుణారావు మాట్లాడుతూ పీఆర్సీపై ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.సాంబశివరావు మాట్లాడుతూ పెండింగులో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఎంఈఓ వై.ప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి మంటి సాంబశివరావు ఆధ్వర్యంలో ఎస్టీయు(డి) మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా అంకం బుజ్జిబాబు, అధ్యక్షుడిగా జి.ఆనందరావు, ఉపాధ్యక్షులుగా పీఎస్ కుమారి, శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎం.ఆదాలు, సహాయ కార్యదర్శులుగా షేక్ షారాబీ, బైమున్నీసా, మహిళా కార్యదర్శిగా అన్నం వేణుకుమారి, ఆర్థిక కార్యదర్శిగా కుంభా సాంబశివరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వి.అరుణరావు, ఎం.సాంబశివరావు, డి.కోటేశ్వరరావులు ఎంపికయ్యారు. ఎంఈఓ-2 శివబాబు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు

కల్తీ పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

బాపట్ల: కల్తీ పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని డీఎస్ఓ ఇ.బి.విలియమ్స్ పేర్కొన్నారు. వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వెదుళ్లపల్లి హైస్కూలులో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్ఓ మాట్లాడుతూ విద్యార్థులు కల్తీ ఉన్న ఆహార పదార్థాలను తినటం వలన తీవ్ర ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని తెలిపారు. తూనికలు, కొలతల్లో ఉండే మోసాలపై కూడా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత్, సమాచార కేంద్ర కన్వీనర్ డి.ఇమ్మానియేల్, తూనికలు కొలతల శాఖ అధికారి రామ్‌దాస్, జిల్లా సైన్స్ అధికారి సాదిక్, ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కోనేటి రాయుడికి నీరాజనాలు

రాజుపాలెం: పల్నాడు తిరుపతిగా పేరుగాంచిన దేవరంపాడు కొండపై స్వయంభూగా వెలసిన నేతి వెంకన్నస్వామి మూడవ శనివారం తిరుణాళ్లకు భక్తులు పోటెత్తారు. సమీప ప్రాంతాల నుంచే గాక సుదూర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు దేవరంపాడు కొండకు విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకునే సమయంలో గోవింద నామస్మరణతో కొండ మారుమోగింది. కోనేటి రాయుడికి కోటి దండాలంటు నీరాజనాలు అందించారు. భక్తులు స్వామివారికి పొంగళ్లుచేసి నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించారు. పశుసంపదను కాపాడాలని నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. తిరునాళ్లలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ గణపతి సురేష్ ఏర్పాట్లు పరిశీలించారు. హుండీలు, విరాళాలు, స్పెషల్, శీఘ్ర దర్శనాలు, తల నీలాలు, లడ్డు, ప్రసాదాల ద్వారా రూ13,47,259లు ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.



తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు మంచి భవిష్యత్

ప్రొఫెసర్ డాక్టర్ హీరాసింగ్



నగరం: కంప్యూటర్‌సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని హైదరాబాద్ శ్రీనిధి విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ హీరాసింగ్ అన్నారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో శనివారం డిజైన్ థికింగ్ ఫర్ ఇన్నోవేషన్ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌లో డాక్టర్ హీరాసింగ్ పాల్గొని మాట్లాడారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. డిజైన్ థింకింగ్ అనేది వినియోగదారుల అవసరాలు, కోరికలను అర్థం చేసుకొని వాటిని కంప్యూటర్ సైన్స్‌తో పరిష్కరించడమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) అన్ని రంగాలలోను మానవాళి జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మనిషి చేసే ఎన్నో పనులను ఏఐ సాయంతో చేయగలుగుతున్నాయన్నారు.

ఏఐ సాంకేతికతను వినియోగించుకుని మానవాళి మనుగడకు ఉపయోగపడే అంశాలపై పరిశోధనలు చేయాలని విద్యార్థులకు సూచించారు. లక్కిరెడ్డి, బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాక్షన్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి, ప్రిన్సిపాల్ హరికృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, అకడమిక్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ సజ్జా శ్రీనివాసరావు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోపుర శిఖర సహిత పునఃప్రతిష్టా మహోత్సవం

గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం గొరిగపూడి గ్రామంలోని శ్రీ భ్రమరి దుర్గాదేవి సమేత శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానం జీవ ధ్వజ విమాన గోపుర శిఖర సహిత పునః ప్రతిష్టా మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి హోమాలు, ప్రాతఃకాల దీక్ష హోమాలు, అనంతరం దేవతామూర్తులు, గోపుర శిఖరాలు, ధ్వజ ప్రతిష్ఠ పూజ, కుంభాభిషేకం నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. రూ.1.10 కోట్ల వ్యయంతో జీవ ధ్వజ విమాన గోపుర శిఖర సహిత పునః ప్రతిష్టా కార్యక్రమం చేపట్టారు. మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున రూ.25 లక్షలు దేవదాయ శాఖకు, రూ.75 లక్షలు వ్యయంతో దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పూర్వ గ్రామకరణం, పులిగడ్డ వారి వంశస్తులు రూ.10 లక్షల విగ్రహాలను సమర్పించారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం శాంతి కల్యాణం, అనంతరం అన్న సంతర్పణ జరగనున్నాయి. ఫణికుమార్ ఆధ్వర్యంలో పూర్వ గ్రామకరణం, పులిగడ్డ వారి వంశస్తుల సహాయ సహకారాలతో బ్రహ్మశ్రీ సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆచార్య అర్చక పర్యవేక్షణలో జరుగుతున్నాయి. సర్పంచ్ గరికపాటి మల్లికా-వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు ఆమంచి సృజన్‌కుమార్, కార్యనిర్వాహణాధికారి పాపని రాజేశ్వరరావులు కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, దేవదాయ ధర్మ శాఖ అధికారులు పాల్గొననున్నారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

చీరాల రూరల్: రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు మత్తుమందుచ్చి వారివద్దనున్న బంగారు ఆభరణాలను దోచుకునే అంతర్రాష్ట్ర దొంగను చీరాల రైల్వే పోలీసులు అరెస్టుచేసి కటకటాల వెనక్కి నెట్టారు. శనివారం జీఆర్పీ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై సీహెచ్.కొండయ్య నిందితుల వివరాలు వెల్లడించారు. గతేడాది నవంబర్‌లో నెల్లూరు నుంచి చీరాలకు రైలులో వస్తున్న ఓ మహిళకు మత్తుమందుచ్చి ఆమె వద్దనున్న బంగారు ఆభరణాలను గుర్తు తెలియని దొంగలు అపహరించారు. ఆ సంఘటనపై గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా, నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ సూచనల మేరకు ఒంగోలు సీఐ ఎస్‌కె. మౌలా షరీఫ్ ఆధ్వర్యంలో కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై చెప్పారు. కేసులోని మొదటి నిందితుడిగా ఉన్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కాజల్ వర్మను ఈఏడాది జనవరిలో అరెస్టు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం కేసులో రెండో నిందితునిగా ఉన్న హర్యానా రాష్ట్రానికి చెందిన విజేందర్‌కుమార్‌ను ఈనెల 12న హర్యానా రాష్ట్రంలో అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసులోని నిందితుడిని ఆయా రాష్ట్రానికి చెందిన కోర్టులో హాజరుపరచి ట్రాన్సిట్ వారెంట్ ద్వారా నెల్లూరులోని రైల్వే కోర్టుకు తరలించి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదులోకి తీసుకున్న చీరాల జీఆర్పీ ఎస్సై సీహెచ్.కొండయ్య, పోలీసులు ఎస్‌కె.ఖాదర్‌బాషా, డి.శ్రీనురాజు, పి.లక్ష్మీనారాయణలను నెల్లూరు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు జి.మురళీధర్, ఒంగోలు సీఐ ఎస్‌కె.మౌలా షరీఫ్‌లు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ ఎస్సై సీహెచ్.కొండయ్య

రెండు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల: వేర్వేరు ప్రమాదాల్లో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరో ఇరువురికి స్వల్పగాయాలైన సంఘటన కొరిశపాడు మండల పరిధిలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు అద్దంకి రోడ్డులోని కొంగపాడు డొంక సమీపంలో బైకుపై వస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలు కాగా ఇతన్ని 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. తీవ్రగాయాలైన వ్యక్తి తాళ్లూరుకు చెందిన పాలపర్తి నగేష్ ఇతను శింగరకొండ తిరునాళ్లకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

మేదరమెట్ల భ్రమర వెంచర్ ఎదురు బైకుపై వెళుతున్న ఇద్దరు రోడ్డు ప్రక్కన బైకు ఆపి కాలకృత్యాలు తీర్చుకొని బైకు వద్ద నిలబడి ఉండగా వెనుక నుంచి వచ్చిన మరో బైకు వీరిని ఢీ కొంది. దీంతో నిలబడి ఉన్న లింగారావు, సుబ్బారావులకు గాయాలు కాగా వీరిని వైద్యశాలకు తరలించినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో బైకు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది.



మేదరమెట్ల భ్రమర వెంచర్ ఎదురుగా ప్రమాదంలో దెబ్బ తిన్న మోటారు బైకు

నర్సరీ భూముల నష్ట పరిహారంపై విచారణ

రెంటచింతల: మాచర్ల - దాచేపల్లి బైపాస్ రోడ్డు(ఎన్‌హెచ్-167 ఏడీ) నిర్మాణంలో భాగంగా రెంటచింతలలో రెండు షేడ్ నెట్ నర్సరీలకు సంబంధించి కోల్పోయిన భూములను శనివారం గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు నేషనల్ హైవే అథారిటీ విజయవాడ ఏఈ ప్రకాష్ నేతృత్వంలోని బృందంతో కలిసి పరిశీలించారు. ఇటీవల రెంటచింతల గ్రామానికి దుగ్గింపూడి జోసఫ్‌రెడ్డి, నరమాల రామకృష్ణ అనే ఇద్దరు రైతులు జాతీయ రహదారి 167 ఏడీ నిర్మాణం వలన తాము ఏర్పాటు చేసుకున్న షేడ్ నెట్ నర్సరీ భూములను కోల్పోయామని, ఇంతవరకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు కోల్పోయిన 787, 788 సర్వే నంబర్లలో ఏర్పాటు చేసిన నర్సరీ భూమిని పునఃపరిశీలించేందుకు ఈ బృందం వచ్చిందన్నారు. జాతీయ రహదారి నిర్మాణం వలన ఒక్కో షేడ్ నెట్ నర్సరీ నిర్వహకులు ఎంత భూమిని కోల్పోయారు.. తదితర వివరాలను సేకరించారు. ఈ రెండు నర్సరీలకు సంబంధించి మొత్తం 0.68 ఎకరాల భూమి కోల్పోయినట్లు మండల ఆర్ఐ పల్లా రామకృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు పూర్తి నివేదికను అందజేయనున్నట్లు ఆర్డీఓ మురళీకృష్ణ తెలిపారు. వారి వెంట జిల్లా ఉద్యానఅధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి, తహసీల్దార్ మూఢావత్ అర్జున్ నాయక్, జాతీయ సెక్షన్ ఇంజినీర్ శ్రీనివాస్, గురజాల హెచ్‌ఓ వై.మోహన్, సర్వేయర్ నవులూరి రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.



నష్టపోయిన నర్సరీ నిర్వాహకుల భూములను పరిశీలిస్తున్న అధికారులు

ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగులకు న్యాయం చేయాలి

ఏపీ వైద్యసేవ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో 17, 24 తేదీల్లో విధుల బహిష్కరణ

వినుకొండ: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 17, 24 తేదీల్లో రాష్ట్రం మొత్తం విధులు బహిష్కరిస్తున్నామని ఏపీ వైద్యసేవ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్టీఆర్‌వీఎస్ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తుందని, ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగులేసిన ప్రభుత్వం ఏప్రిల్ నుంచి బీమా సేవలు కొనసాగుతాయని తెలిజేసిందన్నారు. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో గత 17 సంవత్సరాలుగా ప్రజలకు ఉచిత సేవలందించడంలో కీలకపాత్ర పోషించిన సిబ్బంది ప్రభుత్వాల నుంచి ఎటువంటి లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యలను నెరవేర్చాలని భవిష్యత్ పోరాటానికి సిద్ధమయ్యామని తెలియజేశారు. రాష్ట్ర నాయకులు మాచర్ల బుజ్జి, కాకాని అప్పారావు, జిల్లా నాయకులు సింగంశెట్టి వెంకటేశ్వర్లు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు